క్లుప్తంగా

ప్రజా సమస్యలు పరిష్కరించాలి


వినతిపత్రం ఇస్తున్న నాయకులు

జ్యోతినగర్: ప్రజా సమస్యలను పరిష్కరించాలని డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్ రావుతో పాటు కార్పొరేటర్ కుమ్మరి శ్రీనివాస్‌కు మూడో డివిజన్‌కు చెందిన నాయకులు వినతిపత్రాలు అందించారు. డివిజన్‌లోని అన్నపూర్ణకాలనీ అంబేడ్కర్ వీధిలో నీటి పైప్‌లైన్ లేకపోవడంతో తాగునీటి సమస్య ఉందని, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, రోడ్డు సౌకర్యం లేక కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గురువారం వినతిపత్రం అందించారు. డిప్యూటీ మేయర్, కార్పొరేటర్ సానుకూలంగా స్పందించి సమస్యలను త్వరలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని చెప్పారు. కాలనీవాసులు రామాచారి, వొల్లాల మల్లేశం, ప్రభాకర్‌రెడ్డి, జగన్, శంకర్, సుదర్శన్, శ్యాంకుమార్, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ


చెక్కు అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

కమాన్‌పూర్: మండలంలోని జూలపల్లి గ్రామ పరిధిలోని ముల్కలపల్లికి చెందిన మచ్చ రాజుకు ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.60వేల విలువ గల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును గురువారం బీఆర్‌ఎస్ నాయకులు అందజేశారు. సర్పంచ్ బొల్లపెల్లి శంకర్ గౌడ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, ఉపసర్పంచ్ పోలుదాసరి సాయికుమార్, నాయకులు రాసకొండ రవి, బొమ్మగాని అనిల్, స్వామి, దశరథం, సతీశ్ పాల్గొన్నారు.

రామగిరి మండలంలో..

రామగిరి మండలంలోని బేగంపేటకు చెందిన సముద్రాల చంద్రయ్యకు మంజూరైన రూ.56వేల విలువ గల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును గురువారం బీఆర్‌ఎస్ నాయకులు లబ్ధిదారునికి అందజేశారు. బీఆర్‌ఎస్ నాయకులు పూదరి సత్యనారాయణగౌడ్, మ్యాదరబోయిన కుమార్‌యాదవ్, సర్పంచ్ బుర్ర పద్మ, బుర్ర శంకర్ పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహాల ప్రతిష్ఠాపన



జూలపల్లి: మండల కేంద్రంలో కురుమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం కురుమ కుల దైవం బీరన్న, కమరావతి, మాంకాళమ్మ విగ్రహాలను నూతనంగా నిర్మించిన ఆలయంలో ప్రతిష్ఠించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్‌సింగ్, ఎంపీపీ రమాదేవి, ఓదెల జెడ్పీటీసీ గంటరాములు యాదవ్, బీఆర్‌ఎస్ నాయకుడు నల్ల మనోహర్‌రెడ్డి, సర్పంచ్ దారబోయిన నర్సింహయాదవ్, కురుమ సంఘం అధ్యక్షుడు కోరె శ్రీనివాస్, సభ్యులు చిగుర్ల బీరయ్య, అమరగొండ ఐలయ్య, ఇరుమల్ల రాములు, ఒగ్గు మల్లేశం, మాజీ సర్పంచ్ పొట్టాల మల్లేశం పాల్గొన్నారు.

అభివృద్ధిని అడ్డుకోవడం సరికాదు


మాట్లాడుతున్న చైర్మన్ సందీప్‌రావు

సుల్తానాబాద్‌రూరల్: రైతుల కోసం ఎరువుల గోదాం నిర్మాణాన్ని ఉన్నతాధికారులు అడ్డుకోవడం సరికాదని గర్రెపల్లి సింగిల్‌విండో చైర్మన్ జూపల్లి సందీప్‌రావు అన్నారు. గోదాం ఈ మేరకు గురువారం విలేకరుల సమావేశంలో చైర్మన్ మాట్లాడుతూ గర్రెపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో రైతుల ఎరువుల గోదాం నిర్మాణాన్ని భూపతిపూర్‌లోని ప్రభుత్వ భూమిలో చేపడితే జిల్లా ఉన్నతాధికారులు కూల్చివేయడాన్ని తీవ్రంగా ఖండించారు. రైతుల కోసం చేసే అభివృద్ధి పనులను అడ్డుకోవద్దని ఆయన ఈ సందర్భంగా విన్నవించారు.

నేడు శతాబ్ది ఉత్సవాలు ప్రారంభం

జూలపల్లి: రాష్ట్ర అవతరణ శతాబ్ది ఉత్సవాలు శుక్రవారం ప్రారంభం కానున్నట్లు తహసీల్దార్ జయశ్రీ తెలిపారు. మండలకేంద్రంలోని తహసీల్దారు కార్యాలయంలో జెండావిష్కరణలో అధికారులు పాల్గొనాలని సూచించారు.

అంతర్గత రోడ్లు అధ్వానం

- రోడ్లపై నిలుస్తున్న వరద నీరు
- అరకొరగా ఎన్టీపీసీ సీఎస్సార్ నిధుల విడుదల
- పట్టించుకోని పాలకులు, అధికారులు


ఇటీవల కురిసిన వర్షానికి రోడ్డుపై నిలిచిన వరద నీరు

జ్యోతినగర్: మేడిపండు చూడు మేలిమై ఉండు పొట్ట విప్పి చూడు పురుగులుండు అన్న చందంగా ఉంది అన్నపూర్ణకాలనీ పరిస్థితి. రామగుండం కార్పొరేషన్‌లో మూడో డివిజన్ అన్నపూర్ణకాలనీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వేయడంతో రోడ్లు పగులగొట్టారు. కానీ మళ్లీ నిర్మించకపోవడంతో రోడ్లపై వరద నీరు చేరి ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఎన్టీపీసీ రామగుండం సంస్థ ప్రభావిత, పునరావస ప్రాంతంగా ఉన్న కాలనీలో సంస్థ సీఎస్సార్ నిధులతో అరకొర పనులు చేయడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. సీసీరోడ్ల నిర్మాణం సరిగ్గా చేపట్టకపోవడంతోనే అంతర్గత రోడ్ల పరిస్థితి దయనీయంగా మారింది. పాలకులు ఎన్టీపీసీ సంస్థ సీఎస్సార్‌కు వినతిపత్రాలు అందించినా కూడా వారు పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు వాపోతున్నారు. ఎన్టీపీసీ సంస్థ సీఎస్సార్ నిధుల మంజూరులో పాలకులు చొరవ చూపి ప్రజల సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

వాన నీరు రోడ్లపై నిలుస్తోంది



రోడ్లు లేకపోవడంతో వాన నీరు మొత్తం రోడ్లపైన నిలుస్తోంది. ఇంట్లోకి వెళ్లాలంటే బురద నీటిలో నుంచి వెళుతున్నం. మాకు సౌకర్యాలు కల్పించడంలో పట్టించుకోవడం లేదు. మేము కూడా ఇక్కడ ఉంటున్నాం. మా పరిస్థితులు చూసి సమస్యలు పరిష్కరించాలి.

– దుర్గమ్మ, అన్నపూర్ణకాలనీ

సౌకర్యాలు కల్పించాలి



రోడ్లు మొత్తం గుంతలుగా మారాయి. వర్షం పడ్డప్పుడు గుంతలు ఏర్పడక చాలామంది అందులో పడిపోతున్నారు. ఎన్టీపీసీ సంస్థ రోడ్డు వేయడానికి డబ్బులు ఖర్చు చేయాలి. మా భూములు ఎన్టీపీసీకి ఇచ్చినం. మాకు పూర్తి సౌకర్యాలు కల్పించాలి.

– రాజమ్మ, అన్నపూర్ణకాలనీ

పల్లెల్లో వసతుల కల్పనకు చర్యలు


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

పెద్దపల్లిరూరల్: నియోజకవర్గంలోని గ్రామాల్లో ప్రజలకు కనీస వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. పెద్దపల్లి మండలం మూలసాల గ్రామంలో గురువారం రూ.8లక్షల వ్యయ అంచనాలతో చేపట్టిన సిమెంట్ రోడ్ల నిర్మాణ పనులను ఎమ్మెల్యే శంకుస్థాపన చేసి మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పల్లెప్రగతి కార్యక్రమంతో పల్లెల రూపురేఖలు మారాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్నివర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతోందన్నారు. సర్పంచ్ ఎనగందుల శంకరయ్య, జెడ్పీటీసీ రామ్మూర్తి, మండల రాంరెడ్డి, కొమురయ్య, శ్రీనివాస్, కొమురయ్య, బక్కయ్య పాల్గొన్నారు.

12 రకాల నిత్యావసరాలు అందజేయాలి


వినతిపత్రం ఇస్తున్న ప్రతినిధులు

రామగుండం: ప్రజా పంపిణీ షాపుల ద్వారా వినియోగదారులకు 12 రకాల నిత్యావసరాలను పంపిణీ చేసేలా ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని కోరుతూ గురువారం సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా ప్రతినిధులు రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎంతో ఆర్భాటంగా సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించిన విషయం తెలిసిందే. సదరు సర్వే ఆధారంగా ఇల్లు లేని వారికి గృహ నిర్మాణం, ఇళ్ల స్థలాలు, నూతన రేషన్‌కార్డులు జారీ చేయాలని కోరారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. వినతిపత్రం అందజేసిన వారిలో ప్రజాపంథా ప్రతినిధులు కోడిపుంజుల లక్ష్మి, మార్త రాధ, జూపాక శ్రీనివాస్, తోకల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులకు ఖనిజ లవణాల మిశ్రమం పంపిణీ


మిశ్రమం అందిస్తున్న శాస్త్రవేత్తలు, ప్రజాప్రతినిధులు

మంథని: ముత్తారం మండలం సీతంపేటలో రామగిరి ఖిల్లా కృషి విజ్ఞాన కేంద్రం వారు పాడి రైతులకు ఖనిజ లవణాల మిశ్రమం పంపిణీ చేశారు. అనంతరం దాని ఆవశ్యకతను వివరించారు. పాలిచ్చే గేదెల్లో ఖనిజ లవణాల మిశ్రమం చాలా ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని పశుసంవర్థక శాఖ శాస్త్రవేత్త అర్చన తెలిపారు. ఖనిజ లవణాల మిశ్రమం ఈనిన పశువుల్లో, పాలిచ్చే పశువుల్లో ఈనడానికి రెండు నెలల ముందు ఉన్న వాటికి రోజుకు 50 నుంచి 100 గ్రాముల మిశ్రమం వాడితే అన్ని రకాల ఖనిజాలు పశువుకు సంవృద్ధిగా లభించి శరీర నిర్వహణకు ఎంతగానో ఉపయోగపడుతాయని వివరించారు. శాస్త్రవేత్తలు కిరణ్, వినోద్‌కుమార్, ఎంపీపీ జక్కుల ముత్తయ్య, సర్పంచ్ నగేష్ ఉన్నారు.

బడీడు పిల్లలను బడిలో చేర్పించండి


సమావేశమైన టీచర్లు, ఎస్‌ఎంఎస్ చైర్మన్లు

సుల్తానాబాద్: పట్టణాల్లో, గ్రామాల్లో బడి బయట ఉన్న పిల్లలను బడిలో చేర్పించేందుకు ప్రజాప్రతినిధులు ఉపాధ్యాయులకు సహకరించాలని ఇన్‌చార్జి ఎంఈవో సురేందర్ కోరారు. పట్టణంతో పాటు అన్ని గ్రామాల్లో ప్రాథమిక పాఠశాలలు, ప్రాథమిక ఉన్నత పాఠశాలలో గురువారం బడిబాట కార్యక్రమంలో భాగంగా పాఠశాలలను ఓపెన్ చేసి ఉపాధ్యాయులు, సిబ్బంది, ఎస్‌ఎంఎస్ చైర్మన్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ డ్రాప్ అవుట్ లేకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. హెచ్‌ఎంలు శారద, రాజేందర్, విజయ్‌రావు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

✦ బడిబాటపై సన్నాహక సమావేశం

ఎలిగేడు: మండల కేంద్రంలోని మండల విద్యావనరుల కేంద్రంలో ఎంఈవో కవిత అధ్యక్షతన గురువారం బడిబాటపై సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంఈవో కవిత మాట్లాడుతూ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా 2న శుక్రవారం అన్ని పాఠశాలల్లో పతాక ఆవిష్కరించాలని, బడిబాట ప్రణాళికలో భాగంగా రోజువారీ షెడ్యూల్‌ను అనుసరించి కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఎంపీ యూపీఎస్ శివపల్లి బడిబాట కరపత్రాలను ఆవిష్కరించారు. స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం జీవన్‌రెడ్డి ఎంఎస్‌వో సుదర్శనం, సీఆర్పీలు లక్ష్మీనారాయణ, శ్వేత, ఐఈఆర్పీ సంతోష్ పాల్గొన్నారు.

✦ కొనసాగుతున్న బీరన్న పట్నాలు

ఎలిగేడు: మండలంలోని ధూళికట్టలో కుర్మ, యాదవ సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న బీరన్న పట్నాల ఉత్సవాల్లో భాగంగా గురువారం బీర్ల పూజారులు ఎట్టి ముల్లెలు మోయుట ప్రత్యేక పూజ నిర్వహించారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కొండ తిరుపతి, సందనవేని రాజయ్య, వేముల బీరయ్య, అమరగొండ బీరయ్య, కాల్వ చంద్రయ్య, మారం ఓదెలు, లెంకల శ్రీను, కొమ్ము మల్లేశం, మారం కొమురయ్య, మాజీ ఎంపీటీసీ కొమురయ్య, మాజీ ఉపసర్పంచ్ చంద్రయ్య పాల్గొన్నారు.

✦ గ్రంథాలయానికి స్థలం కేటాయింపు

జూలపల్లి: మండల కేంద్రంలోని గ్రంథాలయానికి నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు కాగా స్థలం కేటాయించేందుకు తహసీల్దార్ జయశ్రీ చర్యలు చేపట్టారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం గ్రంథాలయ భవన నిర్మాణానికి 500ఫీట్లు కేటాయించేందుకు సర్వే చేశారు. స్థలం ఇచ్చేందుకు తమకు అభ్యంతరం లేదని కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్ చెప్పారు. ఈ సర్వేలో సీనియర్ అసిస్టెంట్ సదయ్య, ఆర్‌ఐ సంపత్, సర్వేయర్ హస్మా ఉన్నారు.

సీఎంకు కృతజ్ఞతలు తెలిపిన బ్రాహ్మణులు

కమాన్‌పూర్: తెలంగాణ బ్రాహ్మణులకు విప్రహిత బ్రాహ్మణ సంక్షేమ సదనాన్ని నిర్మించడంతో పాటు వేద పండితులకు గౌరవ భృతిని పెంచడాన్ని హర్షిస్తూ తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర కోశాధికారి సముద్రాల విజయసారథి సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

✦ మైక్‌సెట్ అందజేత

జూలపల్లి: మండల కేంద్రంలోని బీరన్న ఆలయానికి ఏగోళపు చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు, బీజేపీ నాయకుడు ఏగోళపు సదయ్యగౌడ్ మైక్‌సెట్ అందజేశారు. బీజేపీ నాయకులు ఉపసర్పంచ్ కొప్పుల మహేశ్, అమరగాని ప్రదీప్‌కుమార్‌గౌడ్, కురుమ సంఘం నాయకులు కోరె శ్రీనివాస్, చిగుర్ల బీరయ్య, గుంటి శంకర్, రమేశ్, రవి ఉన్నారు.

దశాబ్ది ఉత్సవాలను పండుగలా నిర్వహించాలి

మంథని: రాష్ట్ర అవతరణ దినోత్సవం 20 రోజులు పాటు పండుగలా నిర్వహించుకోవాలని జెడ్పీచైర్మన్ పుట్ట మధు అన్నారు. మంథని నియోజకవర్గ స్థాయి ప్రజాప్రతినిధులు, అధికారులతో మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ప్రభుత్వం ఐదురోజుల పాటు ఉత్సవాలు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులు సమన్వయంతో ఉత్సవాలను నిర్వహించాలని, సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని, తనవంతు సంపూర్ణ సహకారం అందిస్తానన్నారు. ఉత్సవాలకు తాను కూడా హాజరవుతున్నట్లు తెలిపారు.

రష్మీ ఠాగూర్‌కు ఎన్టీఆర్ నేషనల్ లెజెండరీ అవార్డు


అవార్డు అందుకుంటున్న రష్మీ ఠాగూర్

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం పట్టణానికి చెందిన రష్మీ ఠాగూర్ ఎన్టీఆర్ నేషనల్ లెజెండరీ–2023 అవార్డు అందుకున్నారు. ఫిల్మ్ అండ్ టెలివిజన్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, తెలుగు సినిమా వేదిక ఆధ్వర్యంలో ఇటీవల హైదరాబాద్‌లోని ఎల్వీ ప్రసాద్ ఆడిటోరియంలో జరిగిన అవార్డు ప్రధానోత్సవంలో ప్రముఖ సినీ నటుడు మురళీమోహన్ చేతుల మీదుగా రష్మీ ఠాగూర్ అవార్డు అందుకున్నారు.

దశాబ్ది ఉత్సవాలకు ఏర్పాట్లు


ఏర్పాట్లను పరిశీలిస్తున్న అనంతరెడ్డి

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని గ్రామాల్లో శుక్రవారం నుంచి నిర్వహించే దశాబ్ది ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగానే మండలంలోని సుద్దాలలోని రైతువేదిక వద్ద చేస్తున్న ఏర్పాట్లను రైతుబంధు జిల్లా అధ్యక్షుడు అనంతరెడ్డి పరిశీలించారు. ఎంపీవో అలీ పాల్గొన్నారు.

ఏర్పాట్లు పూర్తి

సుల్తానాబాద్: మండల కేంద్రంలోని పలు కార్యాలయాలతో పాటు మున్సిపల్ కార్యాలయంలో శతాబ్ది ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్ తెలిపారు.

మిల్లర్లతో కుమ్మక్కైన ప్రభుత్వం

మంథని: ప్రభుత్వం మిల్లర్లతో కుమ్మక్కై రైతులను మోసం చేస్తోందని టీడీపీ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జి మాదాడి శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. ధాన్యం తూకం విషయంలో జరుగుతున్న మోసాలు, లారీల కొరతతో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం రాసులు పేరుకుపోయాయని ఆరోపించారు.

ఉద్యమకారులను గౌరవించాలి


సీఎంకు పోస్టుకార్డు పంపిస్తున్న నాయకులు

ఓదెల: రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో ఉద్యమకారులను గౌరవించాలని ఉద్యమకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు గుండేటి ఐలయ్య యాదవ్ సీఎం కేసీఆర్‌కు కొలనూర్ పోస్టాఫీస్ ద్వారా గురువారం పోస్టుకార్డు పంపారు. 60ఏళ్ల చిరకాల స్వప్నం అయిన ప్రత్యేక రాష్ట్రం కోసం ఎంతో మంది వీరులు అమరులయ్యారని వారి కుటుంబాలను ఆదుకోవాలని వినతిపత్రంలో కోరారు. బండ నిఖిల్, జంగం కొమురయ్య, జీగురు రాజేందర్, సారయ్య, మల్లయ్య పాల్గొన్నారు.

అభివృద్ధిలో దేశానికే దిక్సూచిగా తెలంగాణ


మాట్లాడుతున్న ఎమ్మెల్యే చందర్

గోదావరిఖని: అభివృద్ధిలో దేశానికే దిక్సూచిగా రాష్ట్రం నిలుస్తోందని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలను జూన్ 2 నుంచి 22 వరకు నిర్వహించాలని నిర్ణయించారన్నారు. 2న ఓసీపీ ఫైవ్ వద్ద ఉన్న అమ్మవారి సన్నిధిలో పూజలు నిర్వహించి దశాబ్ది ఉత్సవాలను ప్రారంభిస్తామని, మెయిన్ చౌరస్తాలోని అమరవీరుల స్థూపం వద్ద తెలంగాణ ఉద్యమంలో అమరులైన అమరవీరులకు నివాళి అర్పిస్తామని పేర్కొన్నారు. మేయర్ అనిల్‌కుమార్, డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్ రావు పాల్గొన్నారు.

కూడళ్ల పరిశీలన

గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతంలోని పలు కూడళ్లను ఎమ్మెల్యే కోరుకంటి చందర్ గురువారం పరిశీలించారు. స్థానిక తిలక్‌నగర్ సెంటర్, రమేశ్‌నగర్ సెంటర్ల ప్రధాన కూడళ్ల సుందరీకరణ స్థలాన్ని పరిశీలించారు. మేయర్ బంగి అనిల్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ సుమన్‌రావు, డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్‌రావు ఉన్నారు.

మెకానిక్‌లకు అండగా ఉంటా..

నియోజకవర్గ పరిధిలోని బైక్ మెకానిక్‌లకు తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఎమ్మెల్యే చందర్ పేర్కొన్నారు. స్థానిక గాంధీనగర్‌కు చెందిన గోపరాజు శ్రీనివాస్ అనే మెకానిక్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బైక్ మెకానిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జమ చేసిన రూ.50వేల చెక్కును గురువారం అందజేశారు. ఎమ్మెల్యే రూ.5వేలు అందించారు.

నిత్యాన్నదానానికి సహకరించాలి

రాష్ట్రంలో ప్రసిద్ధిగాంచిన పవిత్ర పుణ్యక్షేత్రమైన శ్రీకొండగట్టు అంజన్నస్వామి ఆలయ సమీపంలో ఏర్పాటు చేయనున్న మున్నూరు కాపు నిత్యాన్నదాన సత్రానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎమ్మెల్యే చందర్ పిలుపునిచ్చారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సంబంధిత పోస్టర్ ఆవిష్కరించారు.

శ్రీభక్తమార్కండేయ విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు


విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న భక్తులు

కాల్వశ్రీరాంపూర్: కాల్వశ్రీరాంపూర్‌లో మూడు రోజులుగా నిర్వహిస్తున్న శ్రీభక్త మార్కండేయ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు గురువారం ముగిశాయి. వేద పండితులు నిట్టూరి సతీశ్‌శర్మ, అంబరీష్ శర్మ, దత్తు శర్మ, విష్ణుశర్మ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలను నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు, మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్, బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష, బీజేపీ నాయకులు సురేశ్‌రెడ్డి, సర్పంచ్ ఆడెపు శ్రీదేవి, పద్మశాలి కుల సంఘం మండల అధ్యక్షుడు సబ్బని రాజమల్లు, గ్రామశాఖ అధ్యక్షుడు గోలి సుధాకర్, నాయకులు ఆడెపు రాజు, శ్రీనివాస్, కుమ్మరికుంట లింగయ్య, బైరి కుమార్, చేరాల శంకర్, గోలి శ్రీకాంత్, సంతోష్ పాల్గొన్నారు.

పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

కాల్వశ్రీరాంపూర్‌లో గురువారం శ్రీభక్త మార్కండేయ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. పద్మశాలీలు, ఉత్సవ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను సన్మానించారు. సర్పంచ్ శ్రీదేవి, పీఏసీఎస్ చైర్మన్ పురుషోత్తం, వైస్ ఎంపీపీ శిరీష, ఏఎంసీ మాజీ చైర్మన్ రాంచంద్రారెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ జెండా కూల్చివేతపై నిరసన


అధికారులు కూల్చివేసిన పార్టీ జెండా గద్దె

గోదావరిఖని: కాంగ్రెస్ పార్టీ జెండా గద్దె కూల్చివేయడం అన్యాయమని పార్టీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక రీగల్ షూమార్ట్ వద్ద గల డివైడర్ మధ్యలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేసేందుకు గద్దె నిర్మించగా మున్సిపల్ అధికారులు అన్యాయంగా కూల్చివేశారని ఆరోపించారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్పొరేటర్లు గురువారం అక్కడకు చేరుకుని నిరసన వ్యక్తం చేశారు. పార్టీకి ప్రజల్లో వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేకే అధికార పార్టీ నేతలు మున్సిపల్ అధికారులతో జెండా గద్దె కూల్చివేశారని మండిపడ్డారు. నిరసన కార్యక్రమంలో మహంకాళిస్వామి, లింగస్వామి, నజీముద్దీన్, ముస్తఫా, తిప్పారపు శ్రీనివాస్, దూళికట్ట సతీశ్ పాల్గొన్నారు.

మహాజన్ సంపర్క్ అభియాన్ విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న ప్రదీప్‌కుమార్

పెద్దపల్లిరూరల్: భారత ప్రధానిగా నరేంద్రమోదీ ప్రజలకు అందిన సంక్షేమ పథకాల వివరాలను ప్రజలకు వివరిస్తూ ముందుకు సాగాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్‌కుమార్ అన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం మాట్లాడారు. జూన్ 2న రాష్ట్రావతరణ వేడుకల సందర్భంగా అన్ని మండల కేంద్రాల్లో జాతీయ జెండాలు ఎగురవేయాలని కోరారు. ప్రపంచంలోనే భారత్ శక్తివంతమైన దేశంగా తయారవుతోందన్నారు. ఈ నెల 30వరకు జరగనున్న మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమాలను బూత్‌స్థాయిలో విజయవంతం చేయాలన్నారు. నాయకులు సంతోష్, రాజేశ్వర్‌రావు, రాజంమహంత, సంపత్‌రావు, తిరుపతి, రాజన్న, దిలీప్, శ్రీకాంత్, రాజేంద్రప్రసాద్, సతీశ్, మధు, రాహుల్, నాగరాజు, గోపాల్, శ్రీనివాస్, సదయ్య, ఫయాజ్, సంతోష్, ప్రభాకర్ ఉన్నారు.

చాక్‌పీస్‌తో అమరవీరుల స్తూపం


అమరవీరుల స్తూపం


ఆడెపు రజనీకాంత్

ఓదెల: రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని మండలంలోని మడక గ్రామానికి చెందిన సూక్ష్మ కళాకారుడు ఆడెపు రజనీకాంత్ సుద్దముక్కతో గురువారం అమరవీరుల స్తూపం చెక్కాడు. చాక్‌పీస్‌పై 2.7 సెంటీమీటర్ల ఎత్తుతో, 7మిల్లీమీటర్ల వెడల్పుతో గుండు పిన్ను సాయంతో సుమారు మూడుగంటల పాటు శ్రమించి చెక్కినట్లు రజనీకాంత్ తెలిపారు.

ఆవిర్భావ వేడుకలకు ముస్తాబైన పోలీస్‌స్టేషన్



యైటింక్లయిన్‌కాలనీ: రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకలకు గోదావరిఖనిటూటౌన్ పోలీస్‌స్టేషన్ ముస్తాబైంది. రంగురంగుల విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు.

శిశుమందిర్ లైబ్రరీకి పుస్తకాలు అందజేత


పుస్తకాలు అందజేస్తున్న క్లబ్ సభ్యులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని శ్రీసరస్వతి శిశుమందిర్ ఉన్నత పాఠశాలకు గురువారం లయన్స్‌క్లబ్ ఎలైట్ సభ్యుడు సతీశ్‌రెడ్డి రూ.20వేల విలువగల పుస్తకాలు అందించారు. సంపత్‌రావు, శశాంక, వెంకటేశం, మహేశ్, హనుమంతరావు, లక్ష్మయ్య పాల్గొన్నారు.